# వీధి వ్యాపారుల పొట్ట కొట్టవద్దు

● పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం
● సర్దిచెప్పిన కమిషనర్ పులి శ్రీనివాసులు


కమిషనర్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న చిరువ్యాపారులు

**నెహ్రూనగర్:** ఓల్డ్‌క్లబ్ రోడ్డులో పర్యటన చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు సదరు రోడ్డులోని డ్రెయిన్‌ను ఆసరాగా చేసుకుని వ్యాపారాలు చేసుకోవడంపై సదరు వ్యాపారాలను వెంటనే తొలగించాలని కింద స్థాయి సిబ్బందిని శనివారం కమిషనర్ ఆదేశించారు. ఈ క్రమంలో వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను తీయవద్దని, మా జీవనధారం ఇదేనని, ఇది తొలగిస్తే మా కుటుంబ పోషణ ఆగమ్యగోచరంగా ఉంటుందని కమిషనర్‌కు విన్నవించారు. అయినా కమిషనర్ డ్రెయిన్‌కు అవతల మాత్రమే పెట్టుకోని వ్యాపారం చేసుకోవాలని, డ్రెయిన్ మీదకు వస్తే తీసి వేస్తామని చెప్పడంతో వీధి వ్యాపారులు అంత కమిషనర్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. అక్కడే ఉన్న స్థానిక కార్పొరేటర్ యాట్ల రవి వారిని వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించి సమస్యను పరిష్కారించాలని కమిషనర్‌ని కోరగా... డ్రెయిన్‌పై ఎటువంటి వ్యాపారాలు నిర్వహించడానికి వీలులేదని చెప్పారు. ఈ క్రమంలో కొంత మంది వీధి వ్యాపారులు కమిషనర్ ఎంత చెప్పిన వినకపోవడంతో తమ పొట్ట కొట్టవద్దంటూ పెట్రోల్ పోసుకునే ప్రయత్నం చేశారు. వెంటనే అక్కడే ఉన్న సిబ్బంది పెట్రోల్ బాటిల్‌ను తీసివేసి వారికి సర్ది చెప్పారు.

**వీధి వ్యాపారులకు అండగా ఉంటాం**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారులకు నగరపాలక సంస్థ తరఫున పూర్తిగా అండగా ఉంటామని, దశల వారీగా వీధి వ్యాపారులకు వెండింగ్ జోన్లను ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తామని, వెండింగ్ జోన్లపై అపోహలు పెట్టుకొని ఆందోళన చెందవద్దని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం సాయంత్రం ఓల్డ్ క్లబ్ రోడ్ వీధి వ్యాపారులు కార్పొరేటర్లతో కలసి తమ సమస్యలపై కమిషనర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగర రాజధాని పరిధిలో ఉన్నందున రోజు రోజుకి ట్రాఫిక్ పెరుగుతుందని, అందుకు తగిన విధంగా ఇప్పటికే రోడ్ల విస్తరణ చేపట్టినట్లు చెప్పారు. అనేక ప్రాంతాల్లో డ్రెయిన్లు, రోడ్లు ఆక్రమణలు చేసుకొని ట్రాఫిక్‌కు, డ్రెయిన్లలో మురుగు పారుదలకు అడ్డంకిగా వ్యాపారాలు చేస్తున్నారన్నారు. నగరంలో వీధి వ్యాపారులకు చట్ట పరంగా భద్రత కల్పించేలా వెండింగ్ జోన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని వివరించారు. త్వరలో గుజ్జనగుండ్ల సెంటర్‌లోని వెండర్స్‌కి జోన్ కేటాయింపు చేస్తున్నామని తెలిపారు. వెండింగ్ జోన్లపై కొందరి దుష్ప్రచారం వలన వాస్తవంగా వీధి వ్యాపారాలు చేసుకొని జీవించే వారు తీవ్ర ఒత్తిడికి గురై ఆందోళన చెందుతున్నారని, వారికి నగరపాలక సంస్థ తరఫున పూర్తి అండగా ఉంటామని స్పష్టం చేశారు. వీధి వ్యాపారులకు ఐడీ కార్డులు అందించి, రుణాలు, వారికి వివిధ సంక్షేమ పథకాలు అందించడానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రవి, రంగారెడ్డి, అంబేడ్కర్, ఆబిద్ బాషా, మొహమూద్, వంశీ పాల్గొన్నారు.

## చిరువ్యాపారులపై ఉక్కుపాదం


మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

**నెహ్రూనగర్:** కూటమి ప్రభుత్వంపై అధికారంలోకి వచ్చిన తరువాత చిరు వ్యాపారులను టార్గెట్ చేస్తూ వారిని అణిచివేసే ధోరణితో వారిపై ఉక్కుపాదం మోపుతున్నారని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పేర్కొన్నారు. ఓల్డ్ క్లబ్ రోడ్డులో గత 30 ఏళ్లుగా తోపుడు బండ్లపై వీధి వ్యాపారం నిర్వహించుకుంటున్న వారిని తొలగించేందుకు నగరపాలక సంస్థ సిబ్బంది రావడంపై స్థానిక చిరు వ్యాపారులు 5వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ యాట్ల రవి ఆధ్వర్యంలో, పలువురు కార్పొరేటర్లు నగరపాలక సంస్థ వీధి వ్యాపారుల ఇబ్బందులకు గురిచేస్తున్న విషయాన్ని నగర మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. కమిషనర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కామిరెడ్డి రంగారెడ్డి, దూపాటి వంశీ, పాపతోటి అంబేడ్కర్, అబిద్ బాషా, వెంకటేశ్వరరావు ఉన్నారు.

## 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి



**గుంటూరు ఎడ్యుకేషన్:** 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి, తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. పట్టాభిపురంలో గుంటూరుజిల్లా కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. బాలాజీ మట్లాడుతూ హైస్కూళ్లలో ప్లస్‌టూ విధానాన్ని కొనసాగించి, రెగ్యులర్ పీజీటీలను ఉద్యోగోన్నతులపై నియమించాలని కోరారు. యాప్స్‌ను తొలగించి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని చెప్పారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేసి, అన్ని కేడర్లలో ఉద్యోగోన్నతులు చేపట్టాలన్నారు. జీఓ 223ను రద్దు చేసి జూనియర్ అధ్యాపక ఉద్యోగోన్నతుల్లో ఉపాధ్యాయులకు 40 శాతం కోటాను అమలు చేయాలని చెప్పారు. ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కోశాధికారి ఎం.సురేష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కన్వీనర్ పి.పద్మజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.బాలచంద్రా రెడ్డి, కె.శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ




**గుంటూరు మెడికల్:** మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి అన్న లక్ష్యంతో గుంటూరు కోబాల్ట్‌పేటలో మహిళలకు టైలరింగ్ ఉచిత శిక్షణ తరగతులు గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. మూడు బ్యాచ్‌లలో 30 మందికి ఈ శిక్షణ తరగతుల ద్వారా టైలరింగ్ లో నైపుణ్య మెలకువలు నేర్పిస్తున్నారు. కార్యక్రమంలో శిక్షణ కోసం వచ్చిన మహిళలు, నేస్తం అధ్యక్షుడు జలీల్ అహ్మద్, డాక్టర్ షామా సుల్తానా, డాక్టర్ ముస్తఫా, మైనారిటీ నాయకులు టోపీ బాబు పాల్గొన్నారు. వివరాలకు 8143222456, 9397602553 సంప్రదించాలని కోరారు.

### ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉపేంద్ర



**గుంటూరు ఎడ్యుకేషన్:** ఆంధ్ర విద్యార్థి సంఘ(ఏవీఎస్) గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా గాడిపర్తి ఉపేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లవరపు అశోక్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. విద్యారంగ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

### రేపు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

**లక్ష్మీపురం:** సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన తాలూకా కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదానీ గ్రూపు కంపెనీల అవినీతి, తప్పిదాలు, క్రోనీ క్యాపిటలిజాన్ని ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అందుకోసం పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రజలపై లక్షల కోట్ల రూపాయల మేర విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నాయకులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, షేక్ వలి, బందెల నాసర్ జీ, జంగాల చైతన్య, మంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### గిరిప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

**పట్నంబజారు:** ఈనెల 15న పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ గుంటూరు డిపో–2 మేనేజర్ షేక్ అబ్దుల్‌సలాం తెలిపారు. ఈనెల 13 రాత్రి గుంటూరు నుంచి బయల్దేరి 14న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల దర్శించుకుని 14వ తేదీ రాత్రికి అరుణాచలం చేరుకుంటారని తెలిపారు. 15వ తేదీ ఉదయం గిరిప్రదక్షిణ అనంతరం భక్తులందరూ దర్శనం చేసుకున్న తరువాత అదేరోజు సాయంత్రం అరుణాలచంలో బయల్దేరి 16వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటారని చెప్పారు. మరిన్ని వివరాలకు 7382897459 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

### జనన, మరణ దరఖాస్తులు 48 గంటల్లో పరిష్కారం కావాలి

**నెహ్రూనగర్:** నగరపాలక సంస్థ పరిధిలోని జనన, మరణ నమోదు కేంద్రంలో ప్రజల నుంచి అందే దరఖాస్తులు 48 గంటల్లో పరిష్కారం కావాలని, నెలల తరబడి పెండింగ్‌లో ఉంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని జనన మరణ నమోదు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, కొన్ని అర్జీలు నెలల తరబడి పెండింగ్ ఉండడం గమనించి ఆగ్రహం వ్యక్తం చేసి, తక్షణం విభాగ డేటా ఎంట్రీ ఆపరేటర్లను మరో విభాగానికి బదిలీ చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు.

## క్రిస్టియన్ భవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్


క్రిస్టియన్ భవనాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

**గుంటూరు రూరల్:** నగర శివారు 41వ డివిజన్‌లోని అడవితక్కెళ్లపాడు టిడ్కో గృహాల సమీపంలో నిర్మాణంలో ఉన్న క్రిస్టియన్ భవనాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. భవనం మొదటి ఫ్లోర్‌లో నిర్మాణం పూర్తయిన భోజనశాల, కాన్ఫరెన్స్ హాల్, ఆఫీసు రూమ్, కారిడార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు అధికారులు భవన నిర్మాణ పురోగతిపై వివరిస్తూ రెండు ఎకరాల స్థలం క్రిస్టియన్ భవన్‌కు కేటాయించడం జరిగిందని, దీనిలో 0.9 ఎకరాల్లో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో మొదటి ఫేజ్ నిర్మాణాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. సెల్లార్, మొదటి అంతస్తులో భోజన ల పూర్తయ్యాయని వివరించారు. ప్రహరీ నిర్మాణం, ఆవరణలో ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని, రెండవ అంతస్తులో ప్రధాన సమావేశ మందిరాన్ని నిర్మించాల్సి ఉందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. చేపట్టాల్సిన నిర్మాణ పనులకు సంబంధించి పూర్తి స్థాయిలో నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి మాబూషరీఫ్, డీఈ భానుప్రకాష్, క్రిస్టియన్ మైనారిటీ సమన్వయకర్త పాస్టర్ ఎన్నయ్య, పాస్టర్లు ఏలీషా, ప్రకాష్ పాల్గొన్నారు.

## రామచంద్రన్ సేవలు అభినందనీయం


ఆచార్య డి.రామచంద్రన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**ఏఎన్‌యూ:** దూర విద్యా కేంద్రం ఇన్‌చార్జి పరీక్షల కో ఆర్డినేటర్, కెమిస్ట్రీ అధ్యాపకులు ఆచార్య డి.రామచంద్రన్ సేవలు అభినందనీయం అని రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అన్నారు. ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్న సందర్భంగా కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సంయుక్తంగా రామచంద్రన్‌కు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ కృషి, పట్టుదలతో రామచంద్రన్ ఈ స్థాయికి ఎదిగారన్నారు. సన్మాన గ్రహీత ఆచార్య రామచంద్రన్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి వచ్చేందుకు సహకరించిన తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వీరయ్య, ఆంధ్ర కేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య హరిబాబు, దూర విద్యా కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, డిగ్రీ పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఎస్.వి. కృష్ణారావు, పీజీ పరీక్షల ఇన్‌చార్జి కో ఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు, కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు ఆచార్య ఆర్.రమేష్ రాజు, అధ్యాపకులు రామచంద్రంతో వారికున్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. పరిశోధకులు ఆయనను ఘనంగా సన్మానించారు.


## ఖాళీ స్థలాల యాజమానులకు నోటీసులు జారీ చేయాలి

**నెహ్రూనగర్:** నగరపాలక సంస్థ పరిధిలో నివాసాల మధ్యలో ప్రజలకు దోమలు, డ్రెయినేజీ సమస్యలకు కారణమైన ఖాళీ స్థలాల యాజమానులకు నోటీసులు ఇవ్వాలని, స్పందించకుంటే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం కమిషనర్ విష్ణు నగర్, సీతయ్య డొంక, కాకాని రోడ్, పండరీపురం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు రెహ్మాన్, మల్లికార్జున, డీఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

**పన్ను బకాయిలు చెల్లించకుంటే..**

నీటి మీటర్ల బకాయిదార్లు రెండు రోజుల్లో చెల్లించకుంటే ట్యాప్ కనెక్షన్ తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ కమిషనర్ చాంబర్‌లో అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లతో ఆస్తి, ఖాళీ స్థల పన్ను, నీటి మీటర్ల చార్జీల వసూలు వేగవంతంపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు బాలాజీ బాష, రెహ్మాన్, సాధిక్ బాషా పాల్గొన్నారు.

## ఈశ్వరరెడ్డికి తుమ్మల సాహితీ పురస్కారం ప్రదానం


ఈశ్వరరెడ్డికి పురస్కారం అందజేత

**నగరంపాలెం:** అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి వీరేశలింగం, గిడుగు, గురజాడ స్ఫూర్తి ప్రదాతలని ఈశ్వరరెడ్డి అన్నారు. అరసం, విశాలాంధ్ర విజ్ఞాన సమితి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గుంటూరు పుస్తక మహోత్సవ ప్రాంగణంలో అమరజీవి తుమ్మల వెంకటరామయ్య సాహితీ పురస్కారం-24ను యోగి వేమన విశ్వ విద్యాలయం తెలుగు అధ్యాపకులు, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.ఈశ్వరరెడ్డికి అందించారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించి, మాట్లాడారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, కె.శరత్, రవి పాల్గొన్నారు.

### బ్రాడీపేట రైల్వే గేటును తాత్కాలికంగా ఓపెన్ చేయాలి

**గుంటూరు మెడికల్:** గుంటూరులో కొద్దిరోజులుగా మరమ్మతుల నిమిత్తం మూడు వంతెనల రహదారి మూసివేయడం వల్ల గుంటూరు నగరంలో ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడుతుందని బీజేపీ కిసాన్ మోర్చరాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ విఠల్ తెలిపారు. శంకర్‌విలాస్ నుంచి ఫ్లైఓవర్ మీదుగా వెళ్లేందుకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బ్రాడీపేట 14రోడ్డు అడ్డరోడ్డు వద్ద ఉన్న రైల్వే గేటును తాత్కాలికంగా కొంతకాలం ఓపెన్ చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండాలని చూడాలని కోరారు.

### ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ

**పట్నంబజారు:** నగరంలోని గుంటూరు -2 డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి పలు విభాగాల్లో మైలేజీ సాధించిన డ్రైవర్లు, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించిన మరికొంత మందిని శనివారం డిపో -2 మేనేజర్ అబ్దుల్ సలాం సత్కరించి క్యాస్ రివార్డు అందజేశారు. పల్లె వెలుగు విభాగంలో అత్యధిక మైలేజీ సాధించిన డీఎస్‌కే రెడ్డి, పలు విభాగాల్లో ప్రతిభ చాటిన ఎ.బాజీ, షేక్ మస్తాన్‌వలి, బి.జక్రయ్య, మాణిక్యారావుతోపాటు మరికొంత మంది సిబ్బందికి అవార్డు అందజేశారు.

### పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనపై కేసు నమోదు

**పట్నంబజారు:** వ్యక్తిపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. సుద్దపల్లి డొంకలోని లక్ష్మీనగర్‌లో నివాసం ఉండే విశ్వనాథం రాజారావు, వెంకటేశ్వర్లు ఇద్దరు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. లావాదేవీల నేపథ్యంలో ఇరువురి మధ్య వివాదం జరిగింది. శనివారం రాజారావుపై వెంకటేశ్వర్లు తన నివాసం వద్ద పెట్రోలు పోసి నిప్పంటించాడు. గాయాలపాలైన రాజారావును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు నేషనల్ కరాటే పోటీలు

**గుంటూరు వెస్ట్(క్రీడలు):** షిటో-ర్యు-కాయ్ ఇంటర్నేషనల్ కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించనున్నట్లు 9వ డాన్ బ్లాక్ బెల్ట్ హాన్షి కె.సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఆదివారం ఉదయం 10-30 నిమిషాలకు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య అతిథులుగా కేంద్ర గ్రామీణ, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ హాజరవుతారని చెప్పారు.

## విద్యార్థుల ప్రగతిపై దృష్టి సారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు


విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న కమిషనర్

**నెహ్రూనగర్:** తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల ద్వారా విద్యా రంగంలో నూతన ఒరవడికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. రైలుపేటలోని గొలుసు నాంచారమ్మ కొండలరావు మున్సిపల్ హైస్కూల్, జలగం రామారావు మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన పేరెంట్స్-టీచర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లకు చదివే పాఠశాల వాతావరణం, పిల్లల ప్రోగ్రెస్‌ని నేరుగా పరిశీలన చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించుకోవాలని, వారి ప్రవర్తన, మిత్రులు, ఆలోచన విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచి క్రమపద్ధతిలో చదువుకొన్న వారేనన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని తాము ఎక్కువ సమయం గడిపే ప్రదేశంలో స్టిక్ చేసుకొని నిత్యం లక్ష్య సాధనపై దృష్టి సారించాలని సూచించారు. తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక అభివృద్ధితో పాటు సమస్యలు కూడా అధికంగా ఉంటున్నాయని, పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఆడ పిల్లలకు ఏ సమస్య ఎదురైనా గుంటూరు జిల్లా పోలీసులు ప్రత్యేకంగా రూపొందించిన మహిళా మీ కోసంకు కాంటాక్ట్ కావాలని, 112కి కాల్ చేయవచ్చని తెలిపారు. అనంతరం తల్లిదండ్రులకు, విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ సజీల, స్థానిక కార్పొరేటర్ పి.సమత, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుధారాణి, ప్రమీల రాణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు ఫర్హనా, వెంకటేశ్వరరావు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, బాలజీ బాషా పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా



వారధి కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

**పట్నంబజారు:** సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తూ, చుట్టుపక్కల జరిగే అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ సూచించారు. కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని రామిరెడ్డితోటలో ఎస్ఐ కె.తరంగణి ఆధ్వర్యంలో శనివారం వారధి కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు, యువత గంజాయి, మత్తు పదార్థాల వంటి వాటికి బానిసలుగా మారకుండా, భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. నివాసాల నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్ హౌస్డ్ మానిటరింగ్ సిస్టమ్)ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏ ఒక్కరికి ఎటువంటి ఇబ్బంది కలిగినా దగ్గర్లో పోలీసు స్టేషన్‌కు, డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్ఐలు రమేష్, హనుమంతరావు పాల్గొన్నారు.

## పాఠశాలల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి


చౌత్రా సెంటర్‌లో పరికరాలను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష అధికారి విజయలక్ష్మి

**గుంటూరు ఎడ్యుకేషన్:** ప్రభుత్వ పాఠశాలల సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఏపీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులకు పాఠశాలపై ఆసక్తి కలిగించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. నూటికి నూరు శాతం తల్లిదండ్రులు పాల్గొనటమే దీనికి నిదర్శనం అని అన్నారు. ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొనడం ఎంతో అభినందనీయమని అన్నారు. మున్సిపల్ కార్యాలయ పి.ఓ. రామారావు, పేరెంట్స్ కమిటీ తరఫున సలీం, దుర్గాప్రసాద్ మాట్లాడారు. డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ చిష్టి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. ఖాసీం, పాఠశాల ఆర్చి దాత వై.కోటేశ్వరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దుర్గ, వైస్ చైర్మన్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

